# మోడల్

కథా నిలయం
1081
శ్రీకాకుళం

"అమ్మా ! అనాథను తల్లీ. బిచ్చం !"

"ఫ....ఫ... దుక్కలాగున్నావు పనీపాటా చేసుకోని బతకలేవూ -"

"దిక్కులేనిదాన్ని తల్లీ ! ఆకలి మండిపోతున్నది"

"అరే ! బాబీ ! వాకిట్లో ఎవరో అరుస్తున్నారు చూడు - ఏ దొంగముండో ఏమో....తరిమేసి రా !"

"బాబూ ! ఒక్క పైసా వెయ్యి నాయనా ! నీకు పుణ్యముంటుంది !"

"అరే . వెంకట్ ! ఈ బిచ్చగత్తెను చూడు. దరిద్రానికి అచ్చం మోడల్ వుందిరా !"

"తండ్రీ ! ఒక్క పైస వెయ్యండి నాయనా ! ధర్మదాతలు -"

"గోవిందూ - ఎవతో ముండ కారుముందు నిలబడ్డది. కారుకింద పడి చస్తుందేమో అవతలికి గుంజు - అటు సినిమాకు వేళవుతున్నది"

"అమ్మా... ....తల్లీ - బాబూ - తండ్రీ"

బిచ్చగత్తె సాగిపోతూనే వున్నది.

తిరస్కారం వెంట తిరస్కారం పొందుతూనే వున్నది- ఆండాళ్, వైదేహి, మిసెస్ సక్సేనా, చలపతిరావు ఎందరో మహానుభావులూ అందరి నోళ్ళూ బిచ్చగత్తెను తరిమితరిమి కొడుతూనే వున్నాయి.

బిచ్చగత్తె సాగిపోతూనే వున్నది.

పోయి పోయి రోడ్డు పక్కన ఒక చోట చతికిలపడింది.

అక్కడితో బిచ్చగత్తె కాళ్ళు కదలనని సమ్మె చేశాయి-

అక్కడే వాసవీ సిల్కుహౌస్ వుంది !!

దాని ప్రొప్రయిటర్ పరంధామయ్య !!

పరంధామయ్య షాపులోకి వచ్చిన ఏ స్త్రీ చీరె కొనకుండా పోలేదు

ఆ సొగసు, హొయలు చీరెలో లేదు,

పరంధామయ్య మాటల్లో వుంది !!

షాపులోకి ఎవరైనా వచ్చి ఓ కంచిపట్టు చీరె కావాలని అడిగితే పాంటు మీదనే పరంధామయ్య అ చీరెను తన నడుముకు చుట్టుకోని వారికి ప్రదర్శిస్తాడు.

"ఊహించుకోండి మగవాడు కట్టుకుంటేనే ఇలా వుంధి. ఇంక నీవు కట్టుకుంటేనా .....మీ ఆయన మూర్ఛపోడూ" అన్నట్టు !

అంతే కాదు షాపుకు వచ్చిన ఆడవాళ్ళ అభిరుచులు కూడా పరంధామయ్య నిర్ణయిస్తాడు.

"మీది రోజ్‌కలర్ శరీరం అమ్మాయిగారూ - దానికి ఈ బ్లౌజ్ అయితేనే మాచ్ అవుతుంది -"

"చూడండి - ఈ టెర్లైన్ కట్టుకోని మీరు అలా అలా నడిస్తే వాణిశ్రీ నడిచినట్లుంటారు -"

పరంధామయ్య మాటలకు ఆడవాళ్లు కోపగించుకోరు. అతని చేత తమ శరీర సౌందర్యాన్ని పొగిడించుకోని తగిన చీరెలూ రవికలు కొనుక్కోని పోతూ వుంటారు.

ఈ విధమైన గుణగణ శోభితుడైన పరంధామయ్య కౌంటర్ ముందు ఆసీనుడై రోడ్డు సౌందర్యాన్ని పై నుంచి కిందికి కిందినుండి పైకి తిలకిస్తున్న శుభ సమయంబున ఒకానొక బిచ్చగత్తె ఆయన షాపు ముందు పాదములు సమ్మె చేయుటతో కూలబడియెను !!

పరంధామయ్య దృష్టి బిచ్చగత్తె మీదికి ప్రసరించింది. బిచ్చగత్తె అక్కడే కూర్చోని ముష్టి అడుక్కుంటున్నది-

ఒక్కొక్క బెర్లిను చీరె, ఫెళ ఫెళా సాగిపోతూనే వున్నది. బిచ్చగత్తె బొచ్చెలో చిల్లిగవ్వ పడలేదు.

పరంధామయ్య ముందుగా ఒక మామూలు చూపు చూశాడు !

ఆ చూపులో ఈ అనామిక ఎవరు ?? అన్నంత వరకే దర్శనం వుంది!!

పరంధామయ్య మరీ చదువురాని బైతు కాదు - సాహిత్య జ్ఞానం కూడా వుంది.

దాన్ని వర్తమానానికి సమన్వయం చేసుకో గల శక్తి కూడా వుంది.

'శూరుల జన్మంబు సురుల జన్మంబును పరుల జన్మంబు ఎరుగతరమే'

పరంధామయ్య హైస్కూలు టెక్స్టుబుక్‌లో ఎప్పుడో చదివిన ఓ పద్య పాదం గుర్తుకు వచ్చింది,

'ఔను' బిచ్చగాళ్ళను కూడా ఈ లిస్టులో చేర్చవలసిందే. మరచి పోయాడు కవి' అనుకున్నాడు పరంధామయ్య.

ఈ బిచ్చగత్తె ఎవరు ??

దీని చరిత్ర ఏమిటి ??

ఎక్కడినుండి వచ్చింది ??

ఎక్కడికి పోతుంది ??

దీని పేరూ ఊరూ - బంధువులూ మొగుడూ వగైరా వగైరా ఏమో ఏదీ తెలియదు.

తెలుసుకోవాలన్న వివరమూ ఎవరికీ కలుగదు -

గంగానదిలో కప్ప ఈ బిచ్చగత్తె. దీని చుట్టూ బెర్లిను బీరెలూ రోల్స్ రాయిస్ కార్లూ తిరుగుతున్నాయి. అయినా సరే దీనికి వాళ్ళ సిరీ సంపదలేవీ అంటుకోలేవు' అనుకున్నాడు పరంధామయ్య !

ఈ మొదటి చూపు ఇలా పూర్తి కాగానే ఇప్పుడు పరంధామయ్య రెండో చూపు మొదలు పెట్టాడు.

దీని పేరు యోగదృష్టి !!

మహాలక్ష్మిని విష్ణుపాదాలనుండి తన ఇనప్పెట్టెలోకి లాక్కొచ్చే సంకల్ప వీక్షణం !!

ఈ చూపులో పరంధామయ్య చాలా కుశలుడు !!

అతడీ సృష్టిలో ప్రతి అంశానికీ అణా పైసలలో అస్మిన్ వర్తమాన చాంద్రమాణ వ్యావహారిక కాలమానంలో విలువలు నిర్ణయించి పారేయగలడు !

అట్టి విశేషణ విశిష్టమైన రెండవ చూపు బిచ్చగత్తె మీదికి పరంధామయ్య ప్రసరించాడు !

'దీని విలువ ఎంత ?' అని -

బిచ్చగత్తెను కిందినుంచి పైకీ పైనుంచి కిందికీ చూశాడు. ఆవిడ శరీరం మీద గుడ్డలు ఉన్నాయి కాని ఆ పేరులో వాటిని పిలవడం వస్త్రాలను అవమానించినట్లే !!

చింపిరిజుత్తు - అర్ధనగ్నమైన శరీరం - ఓ బొచ్చె-పక్కనే ఓ కుక్క-అయితే - -

పరంధామయ్య ఇవేవీ చూడలేదు.

వేరే ఇంకేవో చూచాడు -

చూచి అంచనాలు కట్టాడు -

పరంధామయ్యకు బిచ్చగత్తెలో ఏవో సినీ తార వంపులు కొన్ని కన పడ్డాయి !!

పరంధామయ్య బుర్ర పాదరసంలా పని చేసింది.

'ఈ బిచ్చగత్తెతో ఒక ఎక్స్పరిమెంటు చేద్దాం !' అని నిశ్చయించుకున్నాడు పరంధామయ్య !!

పరంధామయ్య బిచ్చగత్తెను షాపు పక్క గదికి పిలిపించి వివరాలు అడిగి తెలుసుకున్నాడు.

మీమె జడ్చర్ల దగ్గర ఓ పల్లెటూరు నుంచి వచ్చింది.

దీనికి అమ్మ లేదు.

నాయన లేడు

మొగుడు లేడు

'నా' అన్నవాళ్లెవరూ లేరు -

కొంతం కాలం ఈతాకు చాపలల్లీ, మరి కొంత కాలం కోతినాడించీ పొట్ట పోసుకున్నది.

కోతి చచ్చింది -

నాతి బస్తీ వీథి కెక్కింది.

'అమ్మా ! అయ్యా ! బాబూ ! తండ్రీ !'

ఇవే ఆమె నినాదాలు - తారక మంత్రాలు !!

పరంధామయ్య అంతా విని చివరకు ఒక నిర్ణయానికి వచ్చాడు.

ఈ నిర్ణయం కేవలం బిజినెస్ మాత్రమే కాదు - నగరం యొక్క వేడినీ వాడినీ పరిశీలించాలని హాబీగా చేస్తున్న ఒక ప్రయోగం...

బిచ్చగత్తికు ఇడ్లీలు తెప్పించి పెట్టాడు. సినీ తారలు వాడే సబ్బుతో స్నానం పోయించి, ముక్కూ మూతీ బాగా తోమించి తన దుకాణంలోని ఒక కాటన్ చీరె ఇచ్చాడు.

అనామిక వస్త్రధారణ చేసింది.

పరంధామయ్య పరిశీలించాడు !

"బ్యూటిఫుల్ - నగరాన్ని తినేస్తుంది" అనుకున్నాడు.

పరంధామయ్య తర్వాత అనామికతో ఆమెకు అర్థమయ్యే భాషలో తన కామె చేసి పెట్టవలసిన పని గూర్చి చెప్పాడు.

పరంధామయ్య చీరెలకు అనామిక పబ్లిసిటీ ఇవ్వాలి. కేవలం చిరునవ్వు నవ్వుతూ చీరెలను చూపించాలి.

అవసరమైతే రెండు క్షణాల్లో చాటుకుపోయి చీరెలు మార్చి వచ్చిన వారికి నచ్చిన చీరెలు కట్టుకోని ప్రదర్శించాలి !

ఇందు కామెకు జీతం !!

రెండుపూటలా తిండి :!

అనామిక ఆశ్చర్యపోయింది -

నిజంగా ఈయన ఏడుకొండల వేంకటేశ్వర స్వామి అనుకుంది.

లేకుంటే తనకు రెండుపూటలా తిండి పెడతానంటాడా ?!

ఆలోచన అనేదే లేకుండా అంగీకరించింది అన్‌దిస్పాట్ అనామిక !!

మరునాడే అనామికకు అర్చన అని నామకరణం చేశాడు పరంధామయ్య!!

అర్చన ఉండడానికి ఒక గది ఏర్పాటు చేశాడు.

అర్చన ఎలా నడవాలో, ఎలా నవ్వాలో నేర్పాడు !!

అర్చన నోరు విప్పి జడ్చర్ల దగ్గర తన గుడిసెల భాష ఎవరితోనూ మాట్లాడ నక్కరలేదు -

ఎందుకంటే అర్చన మాట్లాడితే నోటి ముత్యాలు రాలిపోతాయి కదా !!

అర్చన పనిలో చేరింది.

ధర్మవరం, కంచిపట్టు, ఎమ్మిగనూరు, బెనారస్, ఫారిన్ బెర్లిన్స్, ఆఫ్‌వాయిల్, ఫుల్‌వాయిల్ గద్వాల ..

అన్నిటినీ ముందు తాను ధరించి తర్వాతనే ఈ అర్చనా నైవేద్యాన్ని మహానగర సువాసినులకు సమర్పిస్తున్నది -

అర్చన వంటిమీద అణాకానీ చీటీ గుడ్డ కూడా అంగరంగ వైభోగంగా వెలిగిపోతున్నది.

హాట్ హాట్ స్వీట్ స్వీట్‌గా పరంధామయ్య వ్యాపారం సాగిపోతున్నది.

ఇలా వుండగా ఒకనాడు శ్యామసుందర్ పరంధామయ్య దుకాణానికి వచ్చాడు.

శ్యామసుందర్ అంటే పరంధామయ్యకు ప్రాణం -

అవసరమైతే తన పంచప్రాణాలూ ఇస్తాడు.

కేవలం ప్రేమమాత్రమే కాదు -

శ్యామసుందర్ అంటే పరంధామయ్య కొకరకమైన ఆరాధన -

శ్యామసుందర్ చిత్రాలంటే పరంధామయ్య పడి చస్తాడు.

శ్యామసుందర్ వస్తూనే అర్చనను చూచాడు. తర్వాత నిశితంగా పరిశీలించాడు.

వచ్చిన ఓ గిరాకీకి అర్చన బెనారస్ పట్టుచీరె కట్టుకొని చూపిస్తున్నది -

శ్యామసుందర్ ఆ చీరెలో ఆమె వంపులూ హొయలూ ఎత్తులూ లోతులు చూచినన్ని చూచాడు.

మిగిలినవి కళాదృష్టితో ఊహించుకున్నాడు.

ఆమె ఎవరో తాను చేసిన తమాషా ఏమిటో పరంధామయ్య నవ్వుతూ శ్యామసుందరునికి చెప్పాడు !

శ్యామసుందర్ కొంచెం ఆలోచించి 'నాకిమెనిస్తావా?' అని అడిగాడు.

"ఎక్కడైనా బావ అను కాని వంగతోటదగ్గర మాత్రం అనకని సామెత వుందిలే - అట్లా అర్చన పోతే నా బిజినెస్?"

'అర్చన పోతే ఆ బెనారెస్ వట్టు నీవే కట్టి చూపిస్తావులే కాని అర్చనతోనే నీ బిజినెస్ పుట్టలేదుగా. ఆమెను నాకియ్యి. మోడల్‌గా వాడుకుంటాను. నీకు వెయ్యి రూపాయలు కూడా ఇస్తాను'.

ఇష్టంలేకపోయినా పంచప్రాణాల శ్యామసుందర్ మాట కాదనలేక అర్చనను వెయ్యిరూపాయలకు అమ్మేశాడు పరంధామయ్య!!

'అర్చన' మోడల్‌గర్ల్!!

శ్యామసుందర్ చిత్రమందిరంలో ప్రవేశించింది.

అర్చనను కూర్చోబెట్టి అనేకరకాల బొమ్మలు గీచాడు.

అర్ధనగ్న చిత్రాలు సృష్టించాడు.

అందులో కొన్ని అర్చన పూర్వజన్మ బొమ్మలు కూడా వున్నాయి

ఈతచెట్టుకింద విలాసంగా చాప అల్లుతున్న సుందరకోతిని భుజమెక్కించుకొని కులుకుతున్న కోమలమూర్తి!!

అర్ధ నగ్నదశలో ఆచ్ఛాదనలేని వక్షోజాలతో జనసముద్రంలో ఏమిటో అన్వేషిస్తున్న ప్రకృతి సుందరి!!

మహానగరంమీద తన అందాన్నే ఒక చీరెగా ఒక వలగా విసిరిన మంత్రగత్తె!!

శ్యామసుందర్ పరంధామయ్యకూ అర్చనకూ కూడా బాగానే డబ్బు ముట్టచెప్పాడు.

అర్చనకు ఎంత అందమైన ఉద్యోగం దొరికింది!!

'అమ్మా - తల్లీ - బాబూ - తండ్రీ' అని ఎవరి ఇంటిముందూ కారు ముందూ నిలబడి అరవనక్కరలేదు పరంధామయ్య దుకాణంలో చీరెలు కట్టుకోవాలి - శ్యామసుందర్ గదిలో చీరె రవికె సగం విప్పుకోవాలి.

అంతే తేడా!!

అక్కడా ఇక్కడా మూకాభినయమే!!

శ్యామసుందర్ తన చిత్రాల ఎగ్జిబిషన్ పెట్టాడు.

ఎగ్జిబిషన్ కం సేల్స్ సెక్షన్!

'అబ్బ! ఆ ఈతాకుల చాప అల్లుతున్న అమ్మాయి బొమ్మ ఎంత బాగుందో' అందాక ప్రశంస.

"కోతిని భుజంమీద పెట్టుకున్న ఆ పిల్ల బొమ్మ కొనండి - డ్రాయింగ్ రూంలో పెట్టుకుందాము"

వైదేహి కోరిక.

'దిస్ నెకెడ్ బ్యూటీ ఈజ్ సింప్లీ సబ్లైమ్ అండ్ మార్వెలెస్' మిసెస్ సిన్హా కళాత్మక వ్యాఖ్యానం.

'అబ్బ! ఇక్కడ చిత్రకారుడు నేచురలిజం ప్రదర్శించాడురా. వెనకాల లోయలూ శిఖరాలూ బాక్‌గ్రౌండ్ ప్రకృతి. ఇటు పైపుమాత్రం చూపిస్తున్న పిల్ల - బొమ్మకింద 'అర్చన' అని టైటిల్ - అంటే అది ఆడపిల్ల పేరు మాత్రమేకాదు, ఆ సుందరి తన శరీరంతోనే ప్రకృతిని వర్‌షిప్ చేస్తున్నదని చిత్రకారుని సంకేతం కావచ్చు'-

చిత్రానికి చలపతిరావు మహాభాష్యమూ, టీక, టిప్పణీ!!

అర్చన బొమ్మ 'బహు' విరగబడి చూస్తున్నది నగరం!!

తమ రసాభినివేశాన్ని ప్రదర్శిస్తూ వచ్చినోట్లు పోసి బొమ్మలను కొనుక్కొని పోతున్నారు ఆండాళ్లు వైదేహులు, చలపతిరావులు, గోవిందులు!!